TELTEL/2023/88710

# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

www.telanganamuchatlu.in






వరంగల్ సంపుటి : 2 సంచిక : 29 శుక్రవారం 11 - 10 - 2024 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in

## అధికారిక లాంఛనాలతో..

# ముగిసిన రతన్ టాటా అంత్యక్రియలు



ముంబయి (అక్టోబర్ 10) : దిగ్గజ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు ముగిశాయి. ముంబయిలోని వర్లి శ్మశాన వాటికలో మహారాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించింది. మహారాష్ట్ర సర్కార్ అధికారికంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం తరఫున హెూంమంత్రి అమిత్ షా హాజరయ్యారు.


కడచూపుకు తరలివచ్చి..

అంతర్జాతీయ స్థాయి సంస్థను నెలకొల్పి ఎందరికో ఉపాధి అవకాశా లు కల్పించి, తన సంపాదనలో 60 శాతానికిపైగా పేదల సంక్షేమానికి ఖర్చు పెట్టిన టాటా గ్రూప్ మాజీ చైర్మన్ రతన్ నావల్ టాటా (86) బుధవారం రాత్రి మరణించారు. రెండు దశాబ్దాలకు పైగా టాటా గ్రూప్‌నకు అధిపతిగా ఉన్న రతన్ ఇటీవల తీవ్ర అనారో గ్యంతో దక్షిణ

2లో

## విలువ కట్టలేని రత్నాన్ని

# కోల్పోయిన భారత్



న్యూఢిల్లీ, (అక్టోబర్ 10) : దిగ్గజ పారిశ్రామిక వేత్త, పద్మవిభూషణ్ రతన్ టాటా మరణంతో భారత్ విలువ కట్టలేని రత్నాన్ని కోల్పోయిందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. రతన్ టాటా మరణంతో భారతీయులు తీవ్ర విచారంలో మునిగిపోయారని తెలిపారు. భారతదేశాభివృద్ధిలో ఆయన పోషించిన కీలక పాత్రను దేశ ప్రజలు నిరంతరం గుర్తించుకుంటారన్నారు. ముఖ్యమైన రంగాల్లో పలు పరిశ్రమలు నేలకొల్పడంతోపాటు అందులో ఆయన అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పారని చెప్పారు. సమాజ హితం కోసం అయన భాగస్వామ్యంతోపాటు సహకారన్ని సైతం కొనసాగించిన విషయాన్ని ఈ సందర్భంగా మోహన్ భగవత్ వివరించారు. అలాగే దేశ ఐక్యత, భద్రత గురించే కాకుండా.. సంస్థలోని ఉద్యోగుల ప్రయోజనాలను సైతం ఆలోచించే వారని ఆయన పేర్కొన్నారు. తన ప్రత్యేక ఆలోచనలే కాకుండా.. పని విధానంతో రతన్ టాటా అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారని వివరించారు. రతన్ టాటా అత్యున్నత శిఖరాలను చేరిన కూడా.. ఆయన నిరాడంబరత్వంతోపాటు మానవత్వాన్ని కలిగి ఉన్నారన్న విషయాన్ని ఈసందర్భంగా ఆయన గుర్తు చేశారు. రతన్ టాటా

2లో



## పల్నాడు జిల్లా ఐసిఐసిఐ బ్యాంక్

# కుంభకోణంపై విచారణ

- బాధితులకు అండగా ఉంటామన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

పల్నాడు, (అక్టోబర్ 10) : పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, నరసరావుపేట ఐసీఐసీఐ బ్యాంకు

2లో

## కొండా సురేఖకు నాంపల్లి

# కోర్టు నోటీసులు



హైదరాబాద్, (అక్టోబర్ 10) : మంత్రి కొండా సురేఖకు నాంపల్లికోర్టు నోటీసులు జారీ చేసింది. తన కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున నాంపల్లి కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ ఈనెల 8న కోర్టును కోరారు నాగార్జున. అలాగే వాంగ్మూలం కూడా ఇచ్చారు. సాక్షిగా సుప్రియ వాంగ్మూలాన్ని కోర్టు రికార్డు చేసుకుంది. ఆపై ఈరోజుకు విచారణను వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై నాంపల్లి స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు ఈరోజు (గురువారం) మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖకు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 23కు నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. కాగా.. వాంగ్మూలంలో మంత్రిపై నాగార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. "సినిమా రంగం ద్వారా మా కుటుంబానికి మంచి పేరు ప్రతిష్ఠలు ఉన్నాయి. దేశ వ్యాప్తంగా మా కుటుంబం పట్ల ఆధారాభిమానాలు ఉన్నాయి. జాతీయ స్థాయిలో అనేక అవార్డులు వచ్చాయి.

2లో

# గ్రూప్-1 పరీక్షలకు

## వర్గీకరణ వర్తింపచేయాలి

- అప్పుడే సిఎం రేవంత్‌ను నమ్ముతాం: మందకృష్ణ



హైదరాబాద్,(అక్టోబర్ 10) : మాదిగలను నమ్మించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని ప్రకటనలు చేసినా, నమ్మే పరిస్థితి లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకుండానే 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లకూ వర్గీకరణ వర్తింపజేస్తామని చెప్పి, అమలు చేయకుండానే టీచర్ పోస్టులు భర్తీ చేశారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి శాసనసభలో చెప్పిన మాటలకే విలువలేదని విమర్శించారు. శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తామంటే

2లో



## ప్రజలకు హరీశ్‌రావు

# బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్ (అక్టోబర్ 10) : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలంగాణ ప్రజలకు, మహిళలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ మహిళలు అత్యంత ఇష్టపూర్వకంగా జరుపుకునే పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. పుష్పాలను పూజించి, ప్రేమించేది తెలంగాణ ప్రజలే. ప్రపంచ వ్యాప్తంగా బతుకమ్మ పండుగ ఎంతో ఖ్యాతిని సంపాదించింది. మన బతుకమ్మ పండుగను అమెరికా కూడా అధికారికంగా గుర్తించడం మనందరికీ గర్వకారణం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్

2లో

## రేవంత్ పాలనలో

# రైతులకు నిద్ర లేదు

- ఇచ్చిన హామీల కోసం రోడ్డెక్కుతున్నారు
- మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్ (అక్టోబర్ 10) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతలను కష్టాలను వెంటాడుతూనే ఉన్నాయి. రేవంత్ పరిపాలనలో రైతు కంటి నిండా నిద్రపోయే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం పోరాటం, రైతుబంధు కోసం పోరాటం, రుణమాఫీ కోసం పోరాటం.. ఇలా అనేక రకాలుగా అన్నదాతలు రోడ్డెక్కుతూనే ఉన్నారు. చివరకు వరద పాలైన పంటలకు నష్ట పరిహారం చెల్లించడంలో కూడా రైతులను రేవంత్ ప్రభుత్వం నిలువునా మోసం చేసింది. వరదల్లో నిండా మునిగిన రైతాంగాన్ని.. వంచనతో మళ్లీ రేవంత్ సర్కార్ ముంచిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే.. వేల ఎకరాలకే అరకొర

2లో

## తెలంగాణ ఆడపడచులకు

# బతుకమ్మ శుభాకాంక్షలు

- ట్రాఫిక్ రూల్స్ పాటిద్దామని ప్రతిన చేయాలన్న పొన్నం
- బతుకమ్మ స్ఫూర్తితో చెరువులు కాపాడుకుందామన్న సీతక్క



హైదరాబాద్, (అక్టోబర్ 10) : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మంత్రులు, పలువురు నేతలు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బతుకమ్మ శుభా కాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన వీడియో సందేశం విడుదల చేశారు. ఇందులో వాహనదారులకు పలు సూచనలు చేశారు. సగటున దేశ వ్యాప్తంగా సంవత్సరానికి లక్షా60 వేల మంది రోడ్డు ప్రమాదంలో చనిపోతున్నారని చెప్పారు. తెలంగాణలో సగటున రోజుకు 20

2లో

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
అనునిత్యం ప్రజల పక్షం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్



# సంపాదకీయం

## అంతం అయిపోతారు, ఆ తరువాత?

సుప్రసిద్ధ ఉర్దూ కథారచయిత ఖ్వాజా అహ్మద్ అబ్బాస్ 1980లో నక్సలైట్స్ అని ఒక సినిమా తీశారు. సినిమా చివర్లో పెద్ద కాల్పుల సంఘటన తరువాత, పోలీసు అధికారి మెగాఫోన్ పట్టుకుని 'నక్సలైట్లు ఇంకా ఎవరైనా మిగిలిపోయారా' అని గొంతు చించుకుంటూ అడుగుతాడు. నిశ్శబ్దమే సమాధానం. కానీ, అక్కడికి దూరంగా ఒక ఆదివాసీ గూడెంలో చొక్కా కూడా లేని ఒక చిన్న పిల్లవాడు, రెండు చేతులూ ఎత్తుతాడు, తానున్నానన్నట్టు. అబ్బాస్ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ అభ్యుదయ ఉద్యమం కాలానికి చెందిన రచయిత. ఆయనకు నక్సలైట్ ఉద్యమంతో పూర్తి ఏకీభావమేమీ లేదు. అవగాహనా లేదు. సినిమాలు తీయడం కూడా ఆయనకు రాదు. అయినా ముగింపు అట్లా ఎందుకు చేసినట్టు? ఉద్యమాలు బలప్రయోగంతో అణగారిపోవు అన్న విశ్వాసం, కొనసాగింపు ఉండి తీరుతుందనే ఆశాభావం, ఆయనకు ఉండవచ్చు. భారతదేశ గృహమంత్రి అమిత్ షా ఈ మధ్య తరచు మావోయిస్టుల అంతం గురించి చెబుతున్నారు. 2026 అన్న గడువును పదే పదే వక్కాణిస్తున్నారు. ఆయన చెబుతున్నట్టుగానే, ఛత్తీస్‌గఢ్ గహనారణ్యం అబూజ్ మడ్‌లో దళాలు దళాలుగా, గూడేలు గూడేలుగా మనుషులు చచ్చిపోతున్నారు. ఆ చనిపోవడంలో ప్రభుత్వం విజయం చూస్తోంది. తెగిపడిన తలలను, తెగవలసిన తలలను లెక్కపెట్టి మరీ చెబుతోంది. త్వరలోనే అంతా ముగిసిపోతుంది అన్న భరోసాను ప్రకటిస్తోంది. నాలుగువేల చదరపు కిలోమీటర్ల అరణ్యంలో కొత్త అభివృద్ధిని కలగం టోంది. కొత్త సమాజాన్ని నిర్మిస్తామని తుపాకులు పట్టుకుని పోరాటం చేస్తున్నవాళ్లు మన మధ్య ఆరున్నర దశాబ్దాలుగా కనిపిస్తున్నారు. వాళ్లంతా, ఈ సమాజం కడుపులో నుంచి పుట్టినవాళ్లే. ఈ ప్రజల కన్నబిడ్డలే. పెద్ద ఎత్తున జనాన్ని కూడగట్టి, ఉద్యమాలు చేసి, అంతిమంగా భారత రాజ్యాన్నే పట్టుకోవాలన్నది వాళ్ల వ్యూహం. సహజంగానే ప్రభుత్వాలూ, వ్యవస్థ దాన్ని సహించవు. సాయుధంగా ఉన్నారన్న కారణం ఉంటుంది కనుక, చాటుమాటుగా తిరుగుతుం టారు కనుక వాళ్లను చంపేయడానికి ప్రభుత్వ భటులకు చాలా సులువులు ఉంటాయి. చట్టప్రకారం వెళ్లడం, విచారణ తతంగాలూ ఇటువంటివాళ్ల విషయంలో అనవసరమని భద్రతావ్యవస్థలు నమ్ముతాయి. ఫలితంగా, వేలాదిమంది నక్సలైట్లు నిర్మూలన అయ్యారు. అదే సమయంలో వేలాదిమంది కొత్తగా పుట్టుకువచ్చారు. ఇప్పుడు ఈ పునరావృత చక్రంలో నిర్మూలనదే పైచేయి అయిందని, ఇక అంతా చదును కాబోతోందని ప్రభుత్వం ఆనందిస్తోంది. నిజానికి, నక్సలైట్లతోనే మొదలు కాదు. అంతకు ముందు కమ్యూనిస్టులు ఉన్నారు. తెలంగాణతో సహా దేశంలోని అనేక భాగాల్లో తుపాకుల పోరాటం వాళ్లు చేశారు. అంతకు ముందు భగత్ సింగ్, అల్లూరి వంటి విప్లవవాదులు ఆయుధాలు పట్టుకుని బ్రిటిష్ వారి మీద పోరాడారు. 1857లో భారత రైతాంగం, సైనికులు తిరుగుబాటు చేసి, పోరాడి అణగారిపోయారు. అయినా, ఆ తరువాత పోరాటాలు పుడుతూనే వచ్చాయి. స్వతంత్రం వచ్చిన సమయంలోను, ఆ తరువాత, కమ్యూనిస్టులు, నక్సలైట్లు కాని వారు కూడా చాలా చోట్ల సాయుధ పోరాటాలు చేశారు, చేస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో అనేక సాయుధ సంస్థలు క్రియాశీలంగా ఉన్నాయి. కొన్నిటితో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది, ఒప్పందాలు కూడా చేసుకుంది. ఒప్పందాలు చేసుకున్న చోట కూడా కొందరు తిరుగుబాటు దారులు వాటిని ఒప్పుకోక, పోరాటం కొనసాగిస్తూనే ఉన్నారు. సంస్థలు అంతమైపోవచ్చు, కొన్నిచోట్ల పోరాటాలు మౌనంలోకి పోవచ్చు, ముగిసిపోతాయని చెప్పలేము. కొలంబియాలో గెరిల్లా ఉద్యమం మాఫియాగా మారి, చివరకు లొంగిపోయింది కదా, శ్రీలంకలో టైగర్లను తుడిచిపెట్టారు కదా, మన దేశంలోనూ ఖలిస్తాన్ ఉద్యమం ఉపశమించింది కదా, నేపాల్‌లో మావోయిస్టులు అణగారిపోయారు కదా అని వాదనలు వింటుంటాము. పై ఉదాహరణల్లో ఎక్కడా సమస్య శేషం లేకుండా పోలేదు. కొత్తరూపాల్లో అశాంతి వ్యక్తమవు తోంది. ఒక చారిత్రక జ్ఞాపకంగా కూడా ఆయా ఉద్యమాలు వర్తమాన రాజకీయాల్లో కీలకపాత్ర వహిస్తున్నాయి. ఎందుకంటే, ఎందువల్ల అక్కడ సాయుధ రాజకీయాలు వచ్చాయో, ఆ మూలకారణాలు సమసిపోలేదు. ఎక్కడైనా సమస్య లేకుండా పోయి ఉంటే గనుక, అక్కడ ఉభయపక్షాల అంగీకారంతో, పోరాటవాదుల డిమాండ్లను గణనీయంగా నెరవేర్చడంతో మాత్రమే జరిగింది. 1990 దశకం మొదట్లో, సోవియట్ యూనియన్ కకావికలు అయిపోయినప్పుడు, పెట్టుబడిదారీ ప్రపంచం బహిరంగంగా సంబరపడింది. మేధావులు అయితే, చరిత్ర ఇక ముగిసిపోయింది అన్నారు. అప్పుడు ఒక అంతర్జాతీయ జర్నలిస్టు తన కాలమ్‌లో కొన్ని ప్రశ్నలు వేశారు. "అయితే ఏమిటి? లోకంలో మనుషులు ఉన్నదానితో సంతృప్తిపడతారా? పెట్టుబడిదారీ విధానమే పరమపదమని, ఇంతకు మించిన గొప్ప వ్యవస్థ లేదని సమాధానపడతారా? ఆఫ్రికా ఖండంలోను, ఆసియాలోనూ, దక్షిణ అమెరికా ఖండంలోనూ వారి ప్రభుత్వాలను, ప్రభుత్వాలను శాసిస్తున్న అగ్రరాజ్యాలను వ్యతిరేకించడం విరమించి హ్యాపీలీ లివ్‌డ్ ఎవరాఫ్టర్ అయిపోతారా?" అని ఆ పాత్రికేయుడు హేళనాత్మకంగా అబ్బురపడ్డారు.

## తెలంగాణ ఆడపడచులకు బతుకమ్మ శుభాకాంక్షలు

మంది రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నారని తెలిపారు. దసరా చెడుపై మంచి విజయం సాధించిన దానికి గుర్తు. కుటుంబ సభ్యులందరం కలిసి ఈ పండగకు ఆయుధపూజ చేసే సమయంలో ఒక ప్రతిజ్ఞ చేద్దాం. ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం, హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకుందామని ప్రమాణం చేద్దాం. మద్యం తాగి వాహనం నడపరాదు.. ఇది ప్రమాదానికి సూచిక' అని పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ మంత్రి సీతక్క సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ స్ఫూర్తితో ప్రకృతిని, చెరువులను కాపాడుకుందామని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. చెరువులకు బతుకమ్మకు అవినాభావ సంబంధం ఉందని.. చెరువులు నిండితేనే మన పంటలు పండుతాయన్నారు. పంటలు పండుతేనే మనం పండుగ చేసుకోగలుగుతామన్నారు. అందుకే అందరమూ చెరువులను కాపాడుకుందామని చెప్పుకొచ్చారు. బతుకు నిచ్చే పండగ బతుకమ్మ పండుగ అని పేర్కొన్నారు. వర్షాకాలం ముగుస్తున్న సమయంలో బతుకమ్మ పండుగను జరుపుకుంటామని తెలిపారు. చెరువులకు పూజలు చేసే పండుగ బతుకమ్మ అని అన్నారు. చప్పట్లతో ఆడుతూ గొంతెత్తి పాడటం వల్ల ఆనందం, ఆరోగ్యం కలుగుతాయన్నారు. ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఇచ్చి పండుగ బతుకమ్మను ఘనంగా నిర్వహించు కుందామన్నారు. పూలను పూజిస్తూ, చెరువులను ఆరాధిస్తూ బతుకమ్మ పండుగ జరుపుకుంటున్న ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు అని మంత్రి సీతక్క వెల్లడించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక మన బతుకమ్మ పండుగని కేటీఆర్ అన్నారు. పూలను, ప్రకృతిని దేవుళ్లుగా కొలుస్తూ ఆడ బిడ్డలు ఆనందంగా జరుపుకునే అద్భుమైన పండుగన్నారు. దేశంలోనే ఎక్కడ లేని అరుదైన, అందమైన సంస్కృతి వారసత్వం మన బతుకమ్మ పండగ అని గుర్తుచేసుకున్నారు. చిన్న పెద్ద అని తేడా లేకుండా ఆడ బిడ్డలంతా ఎంతో సంతోషంగా ఈ ఘనమైన పండుగను జరుపుకుంటారన్నారు. ఆడబిడ్డల జీవితాల్లో బతుకమ్మ తల్లి మరిన్ని సంతోషాలు, వెలుగు నింపాలని కోరుకుంటున్నాని తెలుపుతూ ఆడబిడ్డలందరికీ కేటీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు తెలంగాణ వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోనున్నారు. ఈరోజుతో బతుకమ్మ సంబురాలు ముగియనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ వేడుకల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇటు ట్యాంక్ బండ్ వద్ద కూడా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు హాజరుకానున్నారు. బతుకమ్మ సంబరాల నేపథ్యంలో శుభాకాంక్షలు తెలిపారు. ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

## రేవంత్ పాలనలో రైతులకు నిద్ర లేదు

సాయం చేసి చేతులు దులుపుకోవడం అన్యాయం అని మండిపడ్డారు. 4.15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన మాటలు.. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా..? అని కేటీఆర్ నిలదీశారు. పంట నష్టం అంచనాలను తలకిందులుగా ఎందుకు మార్చేసారు..? ఏకంగా 3 లక్షల 35 వేల ఎకరాలు ఎట్లా ఎగిరిపోయాయి..? 79,574 ఎకరాలకే కంటి తుడుపుగా పరిహారం ఇచ్చి మమ అనిపించడం దారుణం..! అపార నష్టంతో అల్లాడుతున్న రైతుల ఆదుకునే విషయంలోనూ ఉదారంగా వ్యవహరించలేరా..? మానవత్వం ప్రదర్శించలేరా..? 5.20 లక్షల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి రాష్ట్రం రిపోర్ట్ ఇచ్చింది నిజం కాదా..? ఇప్పుడు ఇంత భారీ కోతలా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. పెట్టిన పెట్టుబడి కొట్టుకుపోయి.. రాళ్లూ ఇసుక మేటలు వేసిన పొలాలను బాగుచేసుకోవడానికి మీరిచ్చే 10 వేలు ఏ మూలకూ సరిపోవు.. మరి అందులోనూ కుదింపులు చేయడం ఏమాత్రం సమంజసం కాదు..! అన్నదాత ఆపదలో వున్నప్పుడు ఆదుకోవడం.. ప్రభుత్వాల బాధ్యత..! ఆ బాధ్యత నుంచి తప్పించుకోకుండా నష్టం వాటిల్లిన ప్రతి ఎకరానికి పరిహారం అందించండి..! రుణమాఫీలో దగా జరిగింది.. రైతు భరోసా జాడా పత్తా లేదు.. వరదలు ముంచెత్తి నష్టాల్లో.. కష్టాల్లో కూరుకుపోయిన రైతులకు అండగా నిలవట్లేదు..! అన్నదాతపై ఎందుకీ వివక్ష..? అని రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు.

## గ్రూప్-1 పరీక్షలకు వర్గీకరణ వర్తింపచేయాలి

అనుమతి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వమే కాదు.. రేవంత్ ప్రభుత్వం కూడా నిర్బంధాలతోనే నడుస్తోందని ఆరోపించారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు వర్గీకరణ వర్తింపజేయాలని.. లేదంటే వర్గీకరణ తర్వాతే గ్రూప్-1 పరీక్ష నిర్వహించాలని, గ్రూప్-3 పరీక్షలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-4 ఫలితాలు ఇప్పటికే 16 నెలలు ఆగాయని, వర్గీకరణ జరిగే వరకు మరో 2 నెలలు వాయిదా వేయాలని కోరారు. ఈ నెల 16న వరంగల్‌లో భారీ సమావేశం నిర్వహిస్తామన్న ఆయన.. ఆ సమావేశంలో అన్ని కమిటీల సభ్యులు పాల్గొంటారని అన్నారు. ఇప్పటివరకు ఆవేదనతోనే నిరసన చేశామని.. ఇకపై తమ ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

## ప్రజలకు హరీశ్‌రావు బతుకమ్మ శుభాకాంక్షలు

బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రతి బతుకమ్మ పండుగకు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ బతుకమ్మ పండుగ మీ జీవితంలో కొత్త వెలుగులు ప్రసాదించాలని, ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆ అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## విలువ కట్టలేని రత్నాన్ని కోల్పోయిన భారత్

పవిత్ర స్మృతులకు ఈ సందర్భంగా ఆయన వినయ పూర్వక నమస్కారాలు తెలిపారు. అలాగే ఆయన ఆత్మకు భగవంతుడు మోక్షం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. టాటీ సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా బుధవారం రాత్రి కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతూ.. ముంబయి బ్రిచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. బుధవారం రాత్రి 11.30 గంటలకు రతన్ టాటా మరణించారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జంషెట్జీ టాటాకు రతన్ టాటా ముని మనవడు. 1937, డిసెంబరు 28న ముంబైలో రతన్ టాటా జన్మించారు. ఆయన తల్లిదండ్రులు సూని టాటా, నావల్ టాటా. అయితే రతన్ టాటా పదేళ్ల వయస్సులో తల్లిదండ్రులు విడిపోయారు. దీంతో తన నాయనమ్మ నవాజ్‌బాయ్ టాటా వద్ద రతన్ పెరిగారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో విద్యనభ్యసించారు. అనంతరం ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లారు. ఆ తర్వాత.. 1961లో భారత్ తిరిగి వచ్చిన రతన్ టాటా.. తన సంస్థ గ్రూప్‌లో చేరారు. అలా టాటా స్టీల్స్‌లో చిరుద్యోగిగా చేరిన ఆయన.. విభిన్న హెూదాల్లో పని చేశారు. అలాగే 1971లో నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ డైరెక్టర్ ఇన్‌చార్జిగా.. 1981లో టాటా ఇండస్ట్రీస్ ఛైర్మన్‌గా ఆయన పలు బాధ్యతలు నిర్వర్తించిన విషయం విధితమే.

## వినియోగదారులపై భారం పడకుండా అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక దుకాణాలు

నెల్లూరు, తెలంగాణ ముచ్చట్లు : వినియోగదారులపై భారం పడకుం డా అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి ఉత్పత్తి ధరకే నిత్యావసర సరుకులను ప్రజలకు అందించేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులకు సూచించారు. గురువారంకలెక్టరేట్లోని శంకరన్ సమావేశంమందిరంలోజిల్లాస్థాయి ధరల స్థిరీకరణకమిటీసమావేశం జేసీ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈసందర్భంగాజాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్, ఎర్రగడ్డలు, టమోటాల ధరల పెరుగుదలను అదుపులో ఉంచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని హెూల్ సేల్, రిటైల్ వర్తకులతో మాట్లాడి ఇన్వాయిస్ ధరకే పామాయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్ కొనుగోలుచేసి ఎటువంటిఆదాయం లేకుండా ఉత్పత్తి ధరకే ప్రజలకు అందేలా చూడాలన్నారు.

## కొండా సురేఖకు నాంపల్లి కోర్టు నోటీసులు

సినిమా రంగంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. మా కుమారుడు విడాకులకు మాజీ మంత్రి కేటీఆర్ కారణం అని మంత్రి అసభ్యంగా మాట్లాడారు. అలా మాట్లాడం వల్ల మా పరువు ప్రతిష్ఠలకు భంగం వాటిల్లింది. మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. మంత్రి కొండా సురేఖ మాట్లాడిన మాటలు అన్ని అసత్య ఆరోపణలు. రాజకీయ దురుద్దేశంతో మంత్రి ఇలాంటి వాఖ్యలు చేశారు. ఎంతో పేరు ప్రతిష్ఠలు ఉన్న తన కుటుంబం తీవ్ర మనో వేదనకు గురైంది. మంత్రి మాట్లాడిన మాటలు అన్ని టెలివిజన్ ఛానెల్స్‌లో ప్రసారం చేశాయి. అన్ని పేపర్స్ ప్రచురితం చేశాయి. దీని వల్ల మా కుటుంబం తీవ్ర మనోవేదనకు గురైంది. దేశ వ్యాప్తంగా మా కుటుంబంపై తీవ్ర ప్రభావం పడింది. ఇలా మంత్రి చేసిన వ్యాఖ్యల వల్ల మా కుటుంబానికి నష్టం జరిగింది. మా కుటుంబం మానసిక క్షోభకు గురైంది" అంటూ కోర్టుకు నాగార్జున స్టేట్‌మెంట్ ఇచ్చారు.

## అధికారిక లాంఛనాలతో.. ముగిసిన రతన్ టాటా అంత్యక్రియలు

ముంబైలోని బ్రీచ్ క్యాండీ హాస్పిటల్‌లో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించి బుధవారం రాత్రి 11.30 గంటలకు తుది శ్వాస విడిచారు. న్యూయార్క్‌లోని ఇథాకాలోని కార్నెల్ యూనివర్సిటీలో చదువుకున్న రతన్ టాటా 1962లో భారత్‌కు తిరిగి వచ్చి కుటుంబాన్ని పోషించడానికి ఓ దుకాణంలో పనిచేశారు. డిసెంబర్ 28, 1937న నావల్ టాటా, సూని టాటా దంపతులకు పార్సీ జొరాస్ట్రియన్ కుటుంబంలో రతన్ టాటా జన్మించారు. రతన్‌కు జిమ్మీ నావల్ టాటా, నోయెల్ టాటా అనే సోదరులున్నారు. రతన్ టాటా, ఆయన తమ్ముడు జిమ్మీ ముంబయి డౌన్‌టౌన్‌లో నివసించే అమ్మమ్మ నవాజ్‌బాయి దగ్గర పెరిగారు. ఆయన పార్థివదేహాన్ని కడసారి చూసేందుకు వేల సంఖ్యలో నేతలు, ప్రముఖులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు.

## పల్నాడు జిల్లా ఐసిఐసిఐ బ్యాంక్ కుంభకోణంపై విచారణ

శాఖల్లో జరిగిన అక్రమాలపై సీఐడీ విచారణ చేపట్టింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్న బాధితులను మోసం చేసిన వ్యవహారంలో చిలకలూరిపేట బ్యాంకు సిబ్బందిని అధికారులు విచారిస్తున్నారు. ఖాతాదారుల ఎఫ్‌డీలు దారి మళ్లించడంలో ఉన్న పాత్ర, ఎంత మొత్తంలో నగదు దారి మళ్లించారనే విషయంపై ఆరా తీస్తున్నారు. మోసపోయిన ఖాతాదారులకు చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అండగా నిలిచారు. బాధితులకు న్యాయం చేయాలని బ్యాంకు అధికారులను ఆయన కోరారు. బాధితులు రెండు నెలలుగా ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ ఖాతాకు జమ కాకపోవడంతో ఇటీవల బ్యాంకుకు వెళ్లి నిలదీశారు. ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్ల బాండ్లు చెల్లవని.. అందులో నగదు, బంగారం లేదని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో హతాశులయ్యారు. మోసపోయామని గుర్తించి, పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు ఈ కేసును సీఐడీకి అప్పగించారు.

## ఎంతో పేరు ప్రఖ్యాతలు గల మహమ్మదాపురం బీసీ బాలుర వసతి గృహాన్ని మోడల్ విద్యాసంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం

నెల్లూరు, తెలంగాణ ముచ్చట్లు : ఎంతో పేరు ప్రఖ్యాతలు గల మహమ్మదాపురం బీసీ బాలుర వసతి గృహాన్ని మోడల్ విద్యాసంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పొదలకూరు మండలం మహమదాపురం దొడ్ల శంకరమ్మ బీసీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. దాతలు దొడ్ల కుటుంబ సభ్యులు సొంత నిధులతో ఇంత పెద్ద పాఠశాలను ఈ గ్రామంలో నిర్మించడం జిల్లాకే గర్వకారణంగా ఆయన కొనియాడారు. ప్రభుత్వం పరంగా అవసరమైన నిధులను సమకూర్చి ఈ విద్యా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ చెప్పారు. బీసీ బాలపర వసతి గృహం ఆవరణలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం, సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యా సంస్థలను అన్నింటినీ కలిపి అన్ని వసతులతో మోడల్ విద్యా సంస్థగా తీర్చిదిద్దేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ చెప్పారు. విద్యార్థులకు అవసరమైన ల్యాబ్స్, క్రీడా ప్రాంగణాలు ఇతర మౌలిక వసతుల ను కల్పించేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ చెప్పారు. గ్రామస్తులందరూ కూడా ఈ గొప్ప కార్యక్రమంలో తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. తొలుత బీసీ బాలల వసతి గృహంలో నిర్మించిన నూతన భవన నిర్మాణాలను దాత దొడ్ల శేషారెడ్డి తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి ప్రసూన, ఇన్చార్జి హెచ్‌ఎం సునీత, విద్యా కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# ఆదిత్య రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్య రెడ్డికి పెద్దమందడి మండల కాంగ్రెస్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం కాంగ్రెస్ యువ నాయకుడు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి కుమారుడు ఆదిత్య రెడ్డి జన్మదినం సందర్భంగా... హైదరాబాదులోని ఆదిత్య రెడ్డి నివాసంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల అధ్యక్షుడు పెంటన్న యాదవ్, సింగిల్ విండ్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మోజర్ల గట్టు మన్నెం, మణిగిల్ల మాజీ సర్పంచ్ కొండా రవీందర్ రెడ్డి, దొరగుంటపల్లి రాఘవేందర్ రెడ్డి, మణిగిల్ల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోలమాంబ ఆలయంలోని దుర్గమాతను దర్శించుకున్న ఉదారి చంద్రమోహన్ గౌడ్



**తెలంగాణ ముచ్చట్లు, మందమర్రి:** పట్టణంలోని షిర్కే ప్రాణహిత కాలనీలోని పోలమాంబ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర సభ్యులు ఉదారి చంద్రమోహన్ గౌడ్ ఆలయంలో దుర్గమాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వంశీ కృష్ణచార్యులు చంద్రమోహన్ గౌడ్ ను ఘన స్వాగతం పలికారు. ఉదారి చంద్రమోహన్ గౌడ్, మంచిర్యాల జిల్లా నృత్య, కళాకారుల అసోసియేషన్ అధ్యక్షులు సునార్కర్. రాంబాబు నేతకాని, బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు సకినాల శంకర్, పట్టణ యువజన అధ్యక్షుడు ముదారపు శేఖర్ లు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర సభ్యులు ఉదారి చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, పండుగను ప్రజలంతా ఆనందంతో జరుపుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మంచి పరిపాలన అందజేయాలని అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబరాలు



తొమ్మిది రోజులపాటు నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మ సంబరాలను గురువారం నాడు మా గ్రామాల్లో తీరొక్క పూల తోటి మహిళలు భక్తి శ్రద్ధాలతో బతుకమ్మలను ముస్తాబు చేసి గ్రామా నడిబొడ్డున అట్టి బతుకమ్మలను భాజా భజంత్రీలతో మహిళలు నూతన వస్త్రాలు ధరించి బతుకమ్మలను ఒక్క దగ్గర పెట్టి పలు రకాల ఆటపాటలతో ఆటలు ఆడమే కాకుండా ఈ బతుకమ్మ పండుగను ఎందుకు జరుపుకుంటారో వారి పాటల ద్వారా ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఆటలు ఆడమే కాకుండా కోలాటాలు వేస్తూ మహిళలు చిందులు వేశారు అట్టి బతుకమ్మలను చూసేందుకు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో వివిధ గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# ఘనంగా ఆదిత్య రెడ్డి జన్మదిన వేడుకలు

## - ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి జన్మదిన వేడుకలను పెద్దమందడి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి కుమారుడు జిల్లెల్ల ఆదిత్య రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. పలు సేవ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తమ అభిమాన నాయకుడు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మండల అధ్యక్షుడు పెంటన్న యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి గట్టు మన్యం, మాజీ సర్పంచ్ మణిగిల రవీందర్ రెడ్డి, దొడగుంటపల్లి రఘువర్ధన్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీలో ఉద్యోగం సాధించిన వెల్టూర్ యువతి

- ఉపాధ్యాయురాలు కావాలన్న కళ నెరవేరింది
- తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించా !
- వెల్టూర్ యువతి గాయత్రి



**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** ఉపాధ్యాయురాలు కావాలని కలలుగన్నది. లక్ష్యం నిర్దేశించుకుని కష్టపడి చదివి, అనుకున్నది సాధించి, మిగతా వారికి స్ఫూర్తిగా నిలిచింది. సెప్టెంబర్ 30న విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన గాజులపేట బాలరాజు కుమార్తె గాయత్రి టీచర్(ఎస్జిటీ) ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా గాయత్రీ మాట్లాడుతూ... జీవితంలో ఉన్నతంగా ఎదగాలని లక్ష్యం ఉంటే ఏది అడ్డురాదని నిరుపేద కుటుంబానికి చెందిన గాయత్రి అన్నారు. మా తల్లిదండ్రులు బాలరాజు, మన్నెమ్మ మరియు భర్త రాజు ప్రోత్సాహం ఎంతో ఉందని, వారి సహకారంతో కష్టపడి చదువుకొని ఉద్యోగం సాధించానని, ఉద్యోగం రావడం పట్ల చాలా సంతోషంగా ఉందని అన్నారు.

# దేవాలయానికి 25 తులాల వెండి అందజేత

## – దాతలు రంగపురం యశోదమ్మ, చిన్నారెడ్డి




**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలం, వెలటూరు ఆంజనేయస్వామి దేవాలయానికి 25 తులాల వెండి ఆభరణాలను రంగపురం యశోదమ్మ, చిన్నారెడ్డి దేవాలయ పూజారి శ్రీనివాసులు కి అందించారు. మంగళవారం వెలటూరు గ్రామానికి చెందిన, టిడిపి సీనియర్ నాయకులు అర్. పెద్ద శ్రీనివాసరెడ్డి గారి, తల్లిదండ్రులు అర్.యశోదమ్మ, అర్.చిన్నారెడ్డి, ఆంజనేయస్వామి దేవాలయానికి తమ వంతుగా 25 తులాల వెండిని విరాళంగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా రంగపురం యశోదమ్మ, రంగపురం చిన్నారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలు సుభిక్షంగా, పాడిపంటలతో, ఆర్థిక ఇబ్బందులు లేకుండా, సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, ప్రతి ఒక్కరిని నిండు నూరేళ్లు చల్లగా చూడాలని, ఆంజనేయ స్వామిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని ఆర్.యశోదమ్మ, అర్.చిన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ (ప్రస్తుత)సర్పంచ్ ఆర్. శ్రీనివాస్ రెడ్డి, దేవస్థానం కమిటీ మెంబర్ జి.బాల్ రెడ్డి స్వామి, పూజారి శ్రీనివాసులు, సుంకరి యాదయ్య, జి.రఘువరన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పట్టుబడిన ఇసుక టిప్పర్లు



**తెలంగాణ ముచ్చట్లు జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ ప్రతినిధి :** రాజోలి మండల కేంద్రంలో ఉన్నటువంటి తుంగభద్రా నది ఒడ్డున జోరుగా సాగుతున్న ఇసుక రవాణా కొందరు దండంగులు అధికార పార్టీ వల్ల లోకల్ లీడర్ల వల్ల ఇసుకరా రవాణా అర్ధరాత్రి అయిందంటే చాలు ఇసుక టిప్పర్లు జోరు సాగుతుంది అలాంటిది ఈ విషయం తెలుసుకున్న మైనింగ్ పోలీసులు పరిగణంలో సహకరించి ఎస్సై రాజోలి తెల్లవారుజామున సిబ్బందితో బయలుదేరి టిప్పర్లను పట్టుకోవడం జరిగింది వెంటనే బండ్లను సీజ్ చేసి కేసు నమోదు చేయడం చేయడం జరిగింది ఇలాంటి అక్రమాలకు ఎవరైనా పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామన్న రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు.

# ఉరివేసుకుని యువకుని మృతి



**తెలంగాణ ముచ్చట్లు, మందమర్రి:** పట్టణంలోని దీపక్ నగర్ కు చెందిన ఊదురుకోట నవీన్ (33) అనే యువకుడు జీవితంపై విరక్తితో గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై ఎస్ రాజశేఖర్, పట్టణ అదనపు ఎస్సై శ్రీనివాస్ లు తెలిపిన వివరాల ప్రకారం, డీగ్రీ వరకు చదువుకున్న నవీన్ కారు డ్రైవర్ గా కొంత కాలం పనిచేశాడు. గతంలో మార్కెట్ ఏరియాలో వ్యాపారం నిర్వహించి, వ్యాపారంలో సైతం రాణించలేక పోయాడు. తలిదండ్రులు ముసలివారు కావడంతో పాటు ప్రస్తుతం ఎలాంటి జీవనోపాది లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తితో ఇంటి ఆవరణలోని వెనుక గదిలో ఉరివేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈమేరకు మృతిని తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో
మరో సంచలనం
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న తెలంగాణ ముచ్చట్లు తెలుగు దిన పత్రికకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్.సి.ఇన్‌చార్జిలు మండలాల వారిగా విలేకరులు కావలెను.
94936 69669, 9391230209

# స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

## - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి: జిల్లాలో ఎలాంటి అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించే దిశగా అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్ లో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఓటరు జాబితాను ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా తయారు చేయాలని, ప్రీ-రివిజన్, రివిజన్ యాక్టివిటీస్ ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రీ-రివిజన్ యాక్టివిటీస్ లో భాగంగా ఆగస్టు 20వ తేదీ నుండి ఈ నెల 18వ తేదీ వరకు ఇంటింటి సర్వే, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, జాబితాలో తేడాలు ఉన్న వివరాలు నిబంధనల మేరకు తొలగింపు, జాబితాలో సెక్షన్లు, పార్టు, పోలింగ్ కేంద్రాల హద్దులు ఏర్పాటు చేసి అనుమతి కొరకు సమర్పించడం, సమస్యలను గుర్తించి పరిష్కారం కొరకు చర్యలు, కంట్రోల్ టేబుల్ అపడేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, ఈ నెల 19 నుండి 28వ తేదీ వరకు 1 నుండి 8 వరకు దరఖాస్తు ఫారాలను పరిశీలించి ముసాయిదా జాబితా రూపొందించాలని తెలిపారు. రివిజన్ యాక్టివిటీస్ లో భాగంగా ఈ నెల 29న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించాలని, 29 నుండి నవంబర్ 28వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, నవంబర్ 9, 10 తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, డిసెంబర్ 24న ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిష్కరించడం జరుగుతుందని, జనవరి 1, 2025న తుది జాబితా ప్రచురించడం కొరకు ఎన్నికల సంఘం అనుమతి పొందిన అనంతరం 6వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 002-చెన్నూరు (ఎస్సి), 003-బెల్లంపల్లి (ఎస్సి), 004-మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గాలలో 741 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 1 పోలింగ్ కేంద్రం మార్పు కొరకు, చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాలలో 3 చొప్పున నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించడం జరిగిందని, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అనంతరం మొత్తం 747 పోలింగ్ కేంద్రాలు ఉంటాయని తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కార్యచరణలో భాగంగా నవంబర్ 6వ తేదీన నమోదు చేసుకునేందుకు ఆఖరి తేదీగా నిర్ణయించడం జరిగిందని, నవంబర్ 20వ తేదీన నమోదు అయిన దరఖాస్తులను పరిశీలించి ముసాయిదా జాబితా సిద్ధం చేసి 23న ప్రచురించడం జరుగుతుందని, 23 నుండి డిసెంబర్ 9వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, డిసెంబర్ 25వ తేదీన ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిష్కరించి సంబంధిత పత్రాలను పరిశీలించి 30వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాలకు జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలలో అర్హత గల ప్రతి ఒక్కరు తమ వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. అర్హత గల వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ కొరకు ఫారం-18, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కొరకు ఫారం-19 ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. అర్హత గల వారందరు ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు వి రాములు, హరికృష్ణ, భూ సేకరణ ప్రత్యేక అధికారి డి చంద్రకళ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించే దిశగా కృషి చేయాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, మంచి భవిష్యత్తు అందించే దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులకే ఉంటుందని, పిల్లలు ఎక్కువ సమయంలో పాఠశాలలో ఉపాధ్యాయులతోనే గడుపుతారని అన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. అతి తక్కువ సమయంలో డి ఎస్ సి పరీక్ష నిర్వహించడం, ఫలితాలు ప్రకటించడం, ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందని, త్వరలోనే పాఠశాలల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. నియామక పత్రాలు పొందిన ఉపాధ్యాయులు జిల్లాలోని వివిధ పాఠశాలలకు ఎంపిక అవుతారని, ఎక్కడ పని చేసినా ఆ పాఠశాలలోని విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా పని చేయాలని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తోటి ఉపాధ్యాయులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు.

ప్రతి ఉపాధ్యాయుడు అభ్యాసన సామర్థ్యాలలో వెనుకబడిన 5 మంది విద్యార్థులను దత్తత తీసుకొని, మిగతా విద్యార్థులతో సమానంగా తీర్చిదిద్దేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నిబద్ధతతో పని చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును సన్మార్గంలో ఉన్నతంగా తీర్చిదిద్దాలని, మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిపేందుకు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి అభివృద్ధికి విరాళం

కందుకూరు,తెలంగాణ ముచ్చట్లు : కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఈరోజు కందుకూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తనిఖీ నిమిత్తం వెళ్లారు. ఈ సందర్భంగా కందుకూరు పట్టణానికి చెందిన బొగ్గవరపు నరసింహులు అనే వ్యాపారి ఆసుపత్రిలోని వైద్య పరికరాల కొనుగోలు నిమిత్తం 2,00,000/- రూపాయల చెక్కును ఎమ్మెల్యే చేతులు మీదుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శకుంతల కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి లో వసతుల కల్పనకు, పేదలకు వైద్యం అందించుటకు అవసరమైన పరికరాల కొనుగోలు విషయంలో వ్యాపారస్తులు, ప్రముఖులు, దాతలు ముందుకు వచ్చి ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, అల్లం వెంకటేశ్వర్లు, మధిర మధు, మురారి శెట్టి సుధీర్,ఇతర నాయకులు పాల్గొన్నారు.

# 15న ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ ప్రారంభం




నెల్లూరు, అక్టోబర్ 10 తెలంగాణ ముచ్చట్లు : హుండాయ్ మోటర్ ఇండియా కంపెనీ తమ షేర్ల ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్‌ను ఈ నెల 15న ప్రారంభించనుంది. 14వ తేదీన యాంకర్ ఇన్వెస్టర్ బిడ్డింగ్ ఉంటుందని కంపెనీ ప్రతినిధులు గురువారం తెలిపారు. క్రిసిల్ నివేదిక ప్రకారం సీవై 2023లో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలపరంగా ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఓఈఎంగా ఉన్న హుండాయి మోటర్ గ్రూప్‌లో హుండాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ భాగంగా ఉందన్నారు. ఐపీవోకి సంబంధించి ఒక్కో షేరుకు ధర శ్రేణి రూ. 1,865 నుంచి రూ. 1,960 వరకు ఉంటుందని, కనీసం 7 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత 7 ఈక్విటీ షేర్ల గుణిజాల్లో బిడ్లు దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. ఐపీవో కింద ఆఫర్ ఫర్ సేల్ విధానంలో 1,42,194,700 షేర్లను హుండాయ్ మోటర్ కంపెనీ విక్రయించనుందన్నారు. ఆఫర్ ద్వారా సమీకరించే నిధులేవీ కంపెనీకి లభించవని తెలిపారు. కంపెనీ యొక్క షేర్లు బీఎస్ఈ లిమిటెడ్ , నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయబడతాయన్నారు. కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ లిమిటెడ్, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హెచ్ఎస్‌బీసీ సెక్యూరిటీస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జేపీ మోర్గాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మరియు మోర్గాన్ స్టాన్లీ ఇండియా కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ఈ ఆఫర్‌కు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు.

# మహా దుర్గగా కామాక్షితాయి



బుచ్చిరెడ్డిపాలెం,తెలంగాణ ముచ్చట్లు : జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన జొన్నవాడ గ్రామంలో పినాకిని నది తీరాన కొలువైన శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురు వారం భక్తులకు మహా దుర్గగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శ్రీ మల్లికార్జున స్వామి కి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అమ్మవారికి శ్రీ సూక్త విధానంలో అభిషేకాలు నిర్వహించారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం అమ్మవారికి నవావరణ పూజలు జరిపించారు. సామూహిక కుంకుమార్చన లలితా సహస్రనామ,దుర్గా సూక్తం, దేవి సప్తశతి పారాయణాల నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మండపంలో పూలతో శోభాయమానంగా మహా దుర్గ గా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దుర్గాష్టమి వేడుకల్లో పాల్గొని స్వామి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అల్లరించాయి.

**నేడు మహిషాసుర మర్ధిని గా కామాక్షితాయి :** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి దేవస్థానంలో శుక్రవారం మహిషాసుర మర్దినిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వ ఉన్నారని ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఆర్వభూమి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపకు పాత్రులు కావాలని కోరారు.

# చాపల చెరువుల్లో డీజిల్ దొంగలు



బుచ్చిరెడ్డిపాలెం, తెలంగాణ ముచ్చట్లు : చాపల చెరువుల్లో ఏర్పాటుచేసిన ఏరియేటర్లకు అమర్చిన డీజల్ క్యాన్లను కొందరు దొంగతనానికి పాల్పడుతున్నట్లు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. మండల పరిధిలోని దామరమడుగు రేబాల ప్రాంతంలో పెద్ద ఎత్తున చాపల చెరువులు ఉన్నాయి. పలుచోట్ల చేపల చెరువులకు ఏరియేటర్లను మత్య రైతులు ఏర్పాటు చేసుకున్నారు. అయితే రాత్రి సమయాల్లో రైతులు ఏర్పాటుచేసిన చెరువుల్లోని డీజిల్ క్యాన్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకొని పోతున్నారు. ప్రతిరోజు ఐదు నుంచి పది లీటర్లు డీజిల్ దొంగలు దోచుకుపోతున్నారని మత్య రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పోలీసులు దొంగలను పట్టుకుని తమకు సహకరించాలని మత్యకారులు కోరుకుంటున్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



గుంటూరు, తెలంగాణ ముచ్చట్లు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని , లింగ వివక్షత రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సి వుందని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. గురువారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం - 2024 సందర్భంగా కలెక్టర్ ఛాంబర్ నందు ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరచిన విద్యార్థినులకు చిరు సన్మానంతో పాటు సర్టిఫికేట్లను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అందించారు. కరాటే, యోగాభ్యాసము, చదరంగంలో ప్రావీణ్యత కనబరిచిన కుమారి అనిత , ఆంగ్ల విద్య నందు ప్రదర్శించిన ప్రావీణ్యతకు కుమారి అంజనకు , ఇటీవల సంభవించిన వరద సహాయక చర్యలందు సేవలు అందించినందుకు కుమారి జి.శృతి , డి.శైలజ లకు చిరు సన్మానంతో పాటు సర్టిఫికేట్లను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ప్రదానం చేశారు. అనంతరం " బాల్య వివాహం చట్టరీత్యా నేరం %-% బాలల భవిష్యత్తుకు ద్రోహం " అనే గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాధ్ , శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు



**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** తెలంగాణ ఆడపడచులకు ప్రీతి పాత్రమైన పండుగ బతుకమ్మ పండుగ, తొమ్మిది రోజుల పాటే జరిగే వేడుకల్లో చివరి రోజు సద్దుల బతుకమ్మకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. గురువారం జిల్లాలోని మందమర్రి పట్టణం, మండలంలో సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఆడబిడ్డలు బతుకమ్మలు పేర్చడానికి రకరకాల పూలు తెచ్చి, భక్తిశ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో గౌరమ్మను కొలిచారు. దీంతో పట్టణం, మండలంలోని వాడవాడలు పండుగ



ధర్మసాగర్ మండలం,కరుణాపురం గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కళను సంతరించుకున్నాయి.బతుకమ్మల నిమజ్జనం కొరకు సింగరేణి సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను, బతుకమ్మ ఘాట్లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, సింగరేణి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు



అధికారులు బతుకమ్మల ఘాట్ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించారు. పోలీస్ శాఖ అద్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు. బతుకమ్మ పూల దుకాణాలతో పట్టణం సందడిగా మారింది. మరో వైపు విజయదశమి సందర్భంగా వ్యాపార సముదాయాలు, వస్త్ర దుకాణాల్లో సందడిగా కనిపిస్తున్నాయి.

**ఆఖరి రోజుకే ప్రాధాన్యం....**

బతుకమ్మ పండుగలో ఆఖరి తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ.



బతుకమ్మతో చిన్నారి యుక్త




ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విజయదశమి (దసరా) పండుగ కంటే సద్దుల బతుకమ్మకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. మహిళలు నిండు మనసారా గౌరమ్మను ఆరాధిస్తారు. మన సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఆడిపాడతారు. బతుకమ్మ వేడుకలు మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమవుతుంది.ఎంగిలి పూల బతుకమ్మ,అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ,అట్ల బతుకమ్మ , అలిగిన బతుకమ్మ,



వడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేసిన బతుకమ్మలు

వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, సద్దుల బతుకమ్మతో తొమ్మిది రోజులు మహిళలు వివిధ రకాల రూపాలలో, పూలతో, నైవేద్యాలతో బతుకమ్మను కొలుస్తారు.

**వాకిలిలో సందడి....**



బతుకమ్మను పేర్చుతున్న వరంగల్ ఎంపి కడియం కావ్య

గురువారం సాయంత్రం ఆడబిడ్డలు నూతన వస్త్రాలు, ఆభరణాలు ధరించి, చూడ చక్కగా అలకరించుకొని, బతుకమ్మను వాకిలిలో పెట్టి, చుట్టుపక్కల మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలు ఆడారు. దీంతో పట్టణం,మండలం అంతా జానపద గీతాలతో మార్మోగింది. చీకటి పడుతుండగా బతుకమ్మలు తలపై పెట్టుకొని, బతుకమ్మ ఘాటుకు ఊరేగింపుగా చేరుకుని, అక్కడ సైతం బతుకమ్మల పాటలు పాడి, ఆటలు ఆడి గౌరమ్మను పూజించి, నీటిలో నిమజ్జనం చేశారు. అనంతరం పసుపును ఒకరికొకరు పూసుకొని, నైవేద్యం సమర్పించారు. పెరుగన్నం, సజ్జముద్దలు, ఎండు కొబ్బరి అన్నం, పులిహోర, చపాతి ముద్దలు, బియ్యం,




నువ్వులు, పల్లీలు, మొక్కజొన్న పొడుల ఫలారాలు అందరికీ పంచి పెట్టుకున్నారు.

**పల్లే,పట్టణంలో సందడే సందడి....**

తెలంగాణలో ఉన్న అతి పెద్ద పండుగల్లో దసరా ఒకటి. పల్లె, పట్నం అనే తేడా లేకుండా ప్రతి కుటుంబమూ పండుగను జరుపుకుంటారు. గురువారం సద్దుల బతుకమ్మ, శనివారం విజయదశమి (దసరా) పండుగ సందర్భంగా పట్టణం, మండలంలో సందడి నెలకొంది. నూతన వస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలు, వాహనాలు, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ గృహోపకరణాల కొనుగోళ్లతో జిల్లాలోని ముఖ్యవ్యాపార ప్రాంతాలన్నీ రద్దీగా కనిపిస్తున్నాయి. పట్టణంతో పాటు చుట్టుపక్కల



స్టేషన్ ఘనపూర్ మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో చిన్నారులు ఉల్లి లెనీన,ఉల్లి చేతన

పట్టణాలలోని వ్యాపార ప్రాంతాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. బంగారు ఆభరణాల సంస్థలు, వాహన సంస్థలు, అన్ లైన్ వ్యాపార సంస్థలు భారీగా పండుగ ఆఫర్లు ఇస్తుండటంతో అమ్మకాలు పెరిగాయి. మరోవైపు ఇళ్లలో పిండి వంటలు, సకినాలు, కారప్పూస, అరిసెల వంటి పిండి వంటలు తయారీలో కుటుంబాలల్లో పండుగ వాతావరణం నెలకొంది. విజయదశమి (దసరా) పండుగ సందర్భంగా వాడ వాడలలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి మండపాల వద్ద ఆయుధ పూజ, వాహన పూజ, అమ్మవారి దర్శనానికి మండప నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా మద్యం, మాంసం విక్రయాలు విపరీతంగా జరగనుండడంతో వినియోగదారులు మద్యం , మాంసం కొనుగోలుకు బారులు తీరుతున్నారు. దీంతో మద్యం, మాంసం విక్రయ కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. దూరప్రాంతాల నుండి సద్దుల బతుకమ్మ, దసరా పండుగకు స్వగ్రామానికి విచ్చేయడంతో పట్టణం, మండలంలో పండుగ వాతావరణం నెలకొంది.



కాజీపేట లోని ఫాతిమా సర్కిల్లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు





వేలేరు గ్రామంలో ఆకర్షణీయంగా ఆరడుగుల బతుకమ్మ







### తిరుమలలో బ్రహ్మాండంగా

# బ్రహ్మోత్సవాలు

## - సూర్యప్రభ వాహనంపై ఊరేగిన స్వామి



**తిరుమల,తెలంగాణ ముచ్చట్లు :** శ్రీవారి బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సూర్యుడు తేజోనిధి, సకల రోగ నివారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత. వర్షాలు, వాటి వల్ల పెరిగే చెట్లు, చంద్రుడు, అతని వల్ల పెరిగే సముద్రాలు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి. సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుని దర్శనం వల్ల ఆరోగ్య, విద్య, ఐశ్వర్యం, సంతానం వంటి ఫలాలు భక్తకోటికి సిద్ధిస్తాయని నమ్మకం. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం మలయప్పస్వామి వారు చందప్రభ వాహనంపై విహరించి భక్తకులకు అభయమివ్వనున్నారు. చంద్రుడు శివునికి శిరోభూషణమైతే ఇక్కడ శ్రీహరికి వాహనంగా ఉండడం విశేషం. చంద్రోదయం కాగానే కలువలు వికసిస్తాయి. సాగరుడు ఉప్పొంగుతాడు. చందప్రభ వాహనంపై స్వామిని చూడగానే భక్తుల మనసు ఉప్పొంగుతుంది.

# దుర్గాదేవీగా విజయవాడ అమ్మవారు





**విజయవాడ,తెలంగాణ ముచ్చట్లు :** ఇంద్రకీలాద్రి పై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదవరోజు గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. దుర్గాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జై దుర్గా జై జై దుర్గ అన్న నామస్మరంతో ఇంద్రకీలాద్రి మారువోగుతోంది. కాగా దుర్గమును దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భవానీలు వచ్చారు. దుర్ఘతలను పోగొట్టే దుర్గాదేవిని దర్శించుకుంటే సద్గతులు ప్రాప్తిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కాగా ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మూలానక్షత్రం (అమ్మవారి జన్మనక్షత్రం) కావడంతో రాష్ట్ర నలుమూలల భారీగా తరలివచ్చారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. అన్ని క్యూలనూ ఉచితంగా వదిలేశారు. సామాన్య భక్తులతోపాటు, వీఐపీల తాకిడి ఎక్కువవ్వడంతో కొండ కిటకిటలాడింది. అమ్మవారు బుధవారం సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఆలయం మూసివేసే సమయానికి సుమారు 1.50 లక్షల నుంచి 2 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారని దుర్గగుడి అధికారుల అంచనా. సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి లోకేశ్ దంపతులు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో అత్యంత కీలకమైన మూలా నక్షత్రం నాడు ఎలాంటి వివాదాలు, ఆటంకాలు లేకుండా భక్తులు దుర్గమ్మను సరస్వతీ అలంకారంలో దర్శించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళిక, పోలీసు, రెవెన్యూ, దేవదాయశాఖల మధ్య సమన్వయం కారణంగా సామాన్య భక్తులు సైతం తమకు అసౌకర్యం కలిగిందని ఎక్కడా ఫిర్యాదులు రాకపోవడం విశేషం. మూలానక్షత్రంనాడు అన్ని టిక్కెట్ దర్శనాలను ఉచితం చేశారు. లక్షల్లో అమ్మవారిని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించటంలో.. క్యూలైన్ల క్రమబద్ధీకరణలో అన్ని శాఖలు విజయం సాధించాయి.

### చెడుపై మంచి సాధించిన

# విజయానికి ప్రతీక విజయదశమి

## - జిల్లా ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



**అనంతపురం,తెలంగాణ ముచ్చట్లు :** చెడుపై మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పండుగ అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ అన్నారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్కరి కుటుంబానికి విజయాలు వరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలను మంత్రి తెలియజేశారు. దసరా హిందువులకు ముఖ్యమైన పండుగని, ఆశ్వియుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులతో కలిసి పదవ రోజు విజయ దశమి కలసి దసరా పండుగ జరుపుకుంటారని, ఇది ముఖ్యముగా శక్తి ఆరాధనకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే పండుగ అన్నారు. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని అంటారని, శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చిందన్నారు. విజయదశమి పండుగ సందర్భంగా దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్క కుటుంబాలకు ఉండాలని, అందరూ అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.

# మంత్రి నివాసంలో భక్తిశ్రద్ధలతో దుర్గాదేవీ పూజ

## - భక్తిశ్రద్ధలతో నిర్వహించిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి





**నెల్లూరు, తెలంగాణ ముచ్చట్లు :** రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ నివాసంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలను అత్యంత ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దసరా ఉత్సవాల సందర్భంగా మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి ఆధ్వర్యంలో దర్గాదేవి పూజ కార్యక్రమాలను కన్నులపండువగా చేపట్టారు. వేదపండితుల మంత్రోశ్చరణ, మహిళల భక్తిగీతాల నడుమ ఘనంగా పూజా కార్యక్రమాలను పొంగూరు రమాదేవి నిర్వహించారు. మంత్రి నివాసంలో జరిగిన దుర్గాదేవి పూజ కార్యక్రమానికి కులమతాలకతీతంగా 400 మందికి పైగా మహిళలు పాల్గొని పూజలు చేశారు. పూజాకార్యక్రమానికి విచ్చేసిన మహిళలందరిని మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి ఆప్యాయంగా పలకరించి అమ్మవారి చీరలు అందజేశారు. అదేవిధంగా పూజల అనంతరం మధ్యాహ్నం వారందరికీ భోజనం ఏర్పాట్లు చేశారు. దేవీశరన్నవరాత్రుల సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖమంత్రి వర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ నివాసంలో ఆయన సతీమణి రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాదేవీ పూజకార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అక్కడికి విచ్చేసిన మహిళభక్తులందరు ఆనందం వ్యక్తం చేశారు.

# అన్నదమ్ముల అనుబంధం

## దామచర్ల కృష్ణారావు - పూర్ణచంద్రరావు





**టంగుటూరు, తెలంగాణ ముచ్చట్లు :** అన్నదమ్ముల అనుబంధానికి నెలవుగా నేడు దామచర్ల వెంకట కృష్ణారావు జన్మదిన వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి దామచర్ల పూర్ణచంద్రరావు ఔరా అనిపించారు. టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ తండ్రి వెంకట కృష్ణారావు జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు నడుమ మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల వెంకట కృష్ణారావు సోదరులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తండ్రి పూర్ణచంద్రరావు అన్ని దగ్గరుండి జన్మదిన వేడుకలు నిర్వహించడం పలువురుని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా దామచర్ల కుటుంబ సోదరులు జనార్ధన్, శ్రీమన్నారాయణ, మల్లికార్జునరావు, సత్యనారాయణ (సత్య) సోదరి అన్నపూర్ణమ్మ తోపాటు కుటుంబ సభ్యుల నడుమ జన్మదిన వేడుకలు నిర్వహించడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ముందుగా గ్రామంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి దామచర్ల కుటుంబం స్వామివారి ఆశీస్సులను పొందారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్, సత్య మాట్లాడుతూ ప్రత్యక్షంగా పరోక్షంగా వివిధ మాధ్యమాల ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దామచర్ల వెంకట కృష్ణారావు మాట్లాడుతూ దామచర్ల కుటుంబం రాజకీయాలలో గాని వ్యాపారంలో గాని ఎటువంటి మచ్చలు లేకుండా గత మూడు దశబ్దాలుగా పనిచేస్తూ వస్తున్నారని తెలిపారు. అదేవిధంగా పెద్దాయన దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు వారసులుగా జనార్ధన్, సత్య రాజకీయాల్లో నిబద్ధతతో పనిచేసే కుటుంబానికి మంచి పేరు తేవాలని, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# సన్న చిన్నకారు రైతుల జీవితాలను మార్చుతున్న ప్రకృతి వ్యవసాయం

## - నీతి ఆయోగ్ బృందం ప్రశంస

**ఆత్కూరు (ఉంగుటూరు), తెలంగాణ ముచ్చట్లు :** రాష్ట్ర ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం) పేరుతో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆదర్శనీయమని, ప్రత్యేకించి చిన్న సన్నకారు రైతుల జీవనోపాధిని మార్చడానికి ఆర్ వై ఎస్ఎస్ చేస్తున్న కృషిని, సామర్థ్యాన్ని నీతి ఆయోగ్ గౌరవ సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ చంద్ ప్రశంసించారు. రాబోయే రెండు రోజుల్లో క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమ విజయాన్ని గమనించడం ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు.

రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలపై సంపూర్ణ అవగాహన కోసం నీతి ఆయోగ్ గౌరవ సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ చంద్ నేతృత్వంలో 8 మంది సభ్యులతో కూడిన బృందం గురువారం ఏలూరు, కృష్ణా జిల్లాలలో పర్యటించింది. తొలుత కృష్ణా జిల్లాలోని ఉంగుటూరు మండలం, ఆత్కూరులోని స్వర్ణ భారత్ ట్రస్ట్ శిక్షణ భవనంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి విజయ కుమార్ బృంద సభ్యులకు “ఏపీసీఎన్ఎఫ్” గురించి పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరిస్తూ ప్రకృతి వ్యవసాయ ఆవశ్యకత, సార్వత్రిక సూత్రాలు, అమలుతీరు, లక్ష్యాలు, మోడల్స్ తదితర అంశాలను తెలియజేశారు. ఈ సంధర్భంగా టి విజయ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2016వ సంవత్సరంలో 40 వేల మంది రైతులతో మొదలైన ప్రకృతి వ్యవసాయం ఇప్పటికీ 10 లక్షల మంది రైతుల వరకు చేరుకుందని, ప్రభుత్వాలతో పాటు అజీమ్ ప్రేమజీ, కో ఇంపాక్ట్, కేఎఫ్ డబ్ల్యూ తదితర సంస్థల మద్దతుతో కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తున్నట్లు చెప్పారు. 2018వ సంవత్సరంలో 11 మందితో మొదలైన పిఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) ప్రస్తుతం వేల ఎకరాలకు విస్తరించిందని అన్నారు. ఏ గ్రేడ్, ఎటీఎం మోడల్స్ ద్వారా అంతర పంటలను ప్రోత్సహిస్తూ ప్రకృతి వ్యవసాయంలో రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంధర్భంగా బృంద సభ్యుల్లో ఒకరైన వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కమిషనర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ 365 రోజుల గ్రీన్ కవర్, ఆదాయ ఉత్పత్తి, కార్మిక అవసరాలు, దిగుబడి వంటి క్లిష్టమైన అంశాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను బలోపేతం చేయడానికి జీవామృతం, ఘనజీవామృతం వంటి జీవ ఉద్దీపనలపై మరింత పరిశోధన చేయాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఐ కార్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సురేష్ కుమార్ చౌదరి ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిపై తన ఆసక్తిని వ్యక్తం చేశారు. ముఖ్యంగా కరవు ప్రాంతంగా పేరుబడ్డ అనంతపురంలో ఈ విధానం ఆరంభించడం విశేషం అన్నారు. ఆఆవిష్కరణలతో రాష్ట్టవ్యాప్తంగా రైతులను అనుసంధానంచేసేందుకు మరిన్నిపరిశోధనలను ఆయన ప్రోత్సహిం చారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# అర్ధవీడు ఎమ్మార్వో దాసుకు నివాళులర్పించిన ఎమ్మెల్యేలు ముత్తుముల, జూలకంటి



తెలంగాణ ముచ్చట్లు : ప్రకాశం జిల్లా అర్ధవీడు తహశీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న కుక్కముడి దాసు బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వస్థలమైన మాచర్ల నియోజకవర్గం నుంచి విధులకు హాజరయ్యేందుకు అర్ధవీడుకు వస్తుండగా మార్గం మధ్యలో దాసు గుండెపోటుకు గురయ్యారు. వారి మృతి పట్ల గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గారు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మాచర్ల నియోజకవర్గంలో వారి స్వస్థలమైన రచ్చమల్లు గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డితో పాటు భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇరువురు ఎమ్మెల్యేలు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో హెూమాలు



మంత్రాలయం, తెలంగాణ ముచ్చట్లు : మంత్రాలయం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.... ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు దుర్గా మాత అమ్మవారు అష్టమి సందర్భంగా దుర్గా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు..... ఆర్యవైశ్య సోదరులు, మహిళలు అమ్మవారికి పురోహితుడు గౌతం స్వామి ఆధ్వర్యంలో మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి హెూమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు..... కందుకూరు ఫ్యామిలీ, నరసింహ ఫ్యామిలీ పూజలో పాల్గొన్నారు.

# బదిలీ ఏపీఎంకు సన్మానం



మంత్రాలయం, తెలంగాణ ముచ్చట్లు : మంత్రాలయం మండల ఏపీఎం గా పని చేస్తున్న జయశ్రీ ఎమ్మిగనూరు కు బదిలీ కాగా ఆమె స్థానంలో కౌతాళం లో పని చేస్తున్న రాజశేఖర్ ఏపీఎం గా పదవి బాధ్యతలు స్వీకరించారు. బదిలీ పై వెళ్లిన జయశ్రీ కి గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు..... ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి గారి ఆదేశాల మేరకు వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు జి. భీమారెడ్డి గారు సభకు హాజరై జయశ్రీ కి స్వామి వారి మొమెంటో అందజేసి సత్కరించారు.... అదే విధంగా వెలుగు కార్యాలయం సిబ్బంది వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు జి. భీమారెడ్డి గారికి శాలువ కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు..... రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించాలని అధికారులను జి. భీమారెడ్డి గారు ఆదేశించారు....

# దుర్గమాత అమ్మవారిని దర్శించుకున్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : అక్టోబర్10 : షాద్ నగర్ నియోజకవర్గంలో వివిధ గ్రామాలలో దుర్గమాత అమ్మవారిని దర్శించుకున్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి షాద్ నగర్ నియోజకవర్గం లో కొత్తూరు,గూడూరు,కమ్మధనం మరియు ఆర్టీసి కాలనీ మల్లికార్జున కాలనీలలో సరస్వతి దేవి రూపంలో దర్శనమిచ్చిన దుర్గమాత అమ్మవారిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి గారు,అందే బాబయ్య దర్శించుకొని,అన్న ప్రసాద వితరణ చేసారు.వారితో పాటు వంశీ కృష్ణ, పాల్గొన్నారు.

# అక్టోబర్ 15న ఎమ్మిగనూరులో జరిగే కాటికాపరుల జిల్లా సదస్సు ను జయప్రదం చేయండి

## యం డి ఆనంద్ బాబు కేజీబియస్ రాష్ట్ర నాయకులు



ఎమ్మిగనూరు, తెలంగాణ ముచ్చట్లు : అక్టోబర్ 15న ఎమ్మిగనూరులో జరిగే స్మశానంలో వృత్తిని నిర్వహించే కాటికాపరుల జిల్లా సదస్సు ను జయప్రదం చేయాలని కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం రాష్ట్ర నాయకులు యం డి ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి ఎన్ జి కృష్ణ పిలుపునిచ్చారు.గురువారం కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న కార్మిక కర్షక భవన్లో కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి తిక్కప్ప అధ్యక్షతన నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి కేజీబియస్ రాష్ట్ర నాయకులు యం డి ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి ఎన్ జి కృష్ణ మాట్లాడుతూ.. చచ్చే ప్రతి మనిషిని పూడ్చే లేదా కాల్చే వృత్తి నిర్వహించే మన సమస్యల పరిష్కారం పట్ల పాలకులకు ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. తరతరాలుగా ఈ వృత్తిని నిర్వహిస్తున్నా.. ఇదికూడా ఒక వృత్తి, అనే స్పృహ కూడా పాలకులకు గాని, అధికారులకు గానీ లేదన్నారు. దేశాన్ని పాలించే పాలకుడినైనా, ఎంత పెద్ద అధికారివైనా చస్తే మాత్రం పూడ్చేది కాల్చేది మనమేనన్నారు. సావు తంతుల్లో పాల్గొనే వీరంతా.. కరోనా కంటే భయంకరమైన రోగాలు ప్రభలే స్మశానవాటికల్లో వృత్తి నిర్వహించే మన సమస్యలను గమనించలేదంటే అది హాస్యాస్పదమే అన్నారు. మన జిల్లాలో కాటికాపరులు ఎదుర్కొనే సమస్యలపై సమరశీల ఉద్యమాలు నిర్వహించుకునేందుకు అవసరమైన మరింత చర్చాయుత ప్రణాళిక రూపకల్పనకై అక్టోబర్ 15న ఎమ్మిగనూరులో జరగబోయే జిల్లా స్థాయి సదస్సుకు అత్యధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశాం లో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్ దేవసహాయం, జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, బి కరుణాకర్, డి విజయమ్మ, హెచ్ జయరాజు, జిల్లా సహాయ కార్యదర్శులు యం భాస్కర్, హెచ్ చిన్న మారయ్య, ఏ గురుస్వామి, ఆర్ హనుమంతు పాల్గొని మాట్లాడారు. సమావేశానికి కేజీబీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు యువరాజు, నాగశేషులు, ఈశ్వరయ్య, సహాయ కార్యదర్శులు తాయప్ప, మాదన్న, ప్రకాశం, నాయకులు నాగరాజు, మధు, పరమేష్, కేసన్న, రాముడు పాల్గొన్నారు.

# సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సమాయత్తం కండి

## - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా







నంద్యాల, తెలంగాణ ముచ్చట్లు :జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్ని మండలాల తాసిల్దారులు, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, డిఆర్ఓ పద్మజ, నంద్యాల ఆర్డీఓ మల్లికార్జున్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ సుబ్బరాయుడు, కెసి కెనాల్ ఈఈ ప్రకాష్ రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఈఈ రఘురాంరెడ్డి, ఎస్సార్ బీసీ ఎస్ఈ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 16 నుండి జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ప్రారంభమై నవంబర్ 24వ తేదీ వరకు వివిధ దశలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో స్థిరీకరించిన ఆయకట్టుదారుల ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలని మండల తాసిల్దారులను, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తెలుగు గంగ ప్రాజెక్టు కింద 18 మండలాల్లో స్థిరీకరించిన 1,31,079 ఎకరాలకు సంబంధించి 47 సాగునీటి వినియోగదారుల సంఘాలు, కేసీ కెనాల్ కింద 18 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 1,51,592 ఎకరాలకు సంబంధించి 47 సాగునీటి వినియోగదారుల సంఘాలు, ఎస్సార్ బీసీ కింద 9 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 1,51,925 ఎకరాలకు సంబంధించి 50 సాగునీటి వినియోగదారుల సంఘాలు, మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 18 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 43,200 ఎకరాలకు సంబంధించి 105 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి స్థిరీకరించిన ఆయకట్టును బట్టి ప్రాదేశిక నియోజకవర్గాల వర్గీకరణ ప్రక్రియను చేపట్టాలన్నారు. ఈనెల 16 న షెడ్యూల్ వెలవడనున్న నేపథ్యంలో ఈ మేరకు ప్రాజెక్టుల వారీగా సంఘాల ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఒక్కో సాగునీటి సంఘం నుండి 6 నుండి 8 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుందనీ, ఎన్నికైన సాగునీటి సంఘాల సభ్యులు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ను ఎన్నుకుంటారన్నారు. ఇందుకు సంబంధించి డిఆర్ఓ ఎ.పద్మజ, ఇరిగేషన్ ఎస్ఈ వరప్రసాద్ నోడల్ అధికారులుగా వ్యవహరించనున్నారన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాస్టర్ ట్రైనర్లుగా డోన్ ఆర్డిఓ మహేశ్వర్ రెడ్డి, ఏఈఈ విజయ్ కుమార్ ను నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

# దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయింది

## - కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి



కావలి,తెలంగాణ ముచ్చట్లు : ప్రపంచం మెచ్చిన వ్యాపార దిగ్గజం రతన్ టాటా లాంటి ఒక గొప్ప వ్యక్తిని మన దేశం కోల్పోయిందని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఎన్నటికీ చెరగని తన ఇంటి పేరును మాత్రం ఈ దేశానికి వదిలేసి ఆయన తనువు చాలించారన్నారు.

# ఆత్రేయపురం మండల ఎస్సీ నాయకులు

## - చిక్కాల సత్యప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు



రావులపాలెం,తెలంగాణ ముచ్చట్లు : సత్యప్రసాద్ ను కలిసిన మండల ఎస్సీ నాయకులు కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెం మండలం పరిధిలోని ఈతకోట గ్రామానికి చెందిన ప్రముఖ అంబేద్కర్ వాది సాఫ్ట్వేర్ ఇంజనీర్ చిక్కాల సత్యప్రసాద్ ను గురువారం నాడు ఆత్రేయపురం మండల ఎస్సీ నాయకులు రావులపాలెంలో ఆయన స్వగృహం నందు మర్యాద పూర్వకంగా కలిసి దుశ్వాలను కప్పి పూలమాలల వేసి సత్కరించారు ఎస్సీల కాలనీల్లో వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు సమస్యల పరిష్కారానికి నాయకులతో సంప్రదించి వాటి పరిష్కరానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా చిక్కాల హామీ ఇచ్చారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీలపై జరుగుతున్న దాడులు వాటిపై ఏ విధంగా కలిసి పనిచెయ్యాలి అనే అంశాలను, కాలనీల్లో యువతకు నాయకత్వ లక్షణాలుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాకి సూరిబాబు, కుసుమే ప్రవీణ్, నాతి వెంగళరాయుడు, పల్లి సత్యనారాయణ, పమ్మి సత్యనారాయణ, విప్పర్తి సురేష్, ఇసుకుపట్ల సురేష్, పొలిమాటి శ్రీను, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక ఇసుక ట్రాక్టర్ను స్వాధీనం చేసుకున్న గుడ్లూరు పోలీసులు"




గుడ్లూరు అక్టోబర్-10 తెలంగాణ ముచ్చట్లు : గుడ్లూరు మండల పరిధిలోని నరసాపురం చెక్ పోస్ట్ వద్ద అక్రమంగా ఎటువంటి ప్రభుత్వ అధికారుల అనుమతులు పొందకుండా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్ను గుడ్లూరు పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ పై గుడ్లూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి ట్రాక్టర్ను స్వాధీనం చేసుకున్నట్లు గుడ్లూరు ఎస్. ఐ. వి.వెంకట్రావు ఒక ప్రకటన ద్వారా తెలియజేసారు.

# జిల్లా వైసీపీ అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే బుర్రామధుసూదన్ యాదవ్



నెల్లూరు, తెలంగాణ ముచ్చట్లు : జిల్లా వైఎస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా మాజీ శాసనసభ్యులు కందుకూరు ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, వైఎస్సార్సీపీ నాయకులు గురువారం కలిశారు.

# వైద్య పరికరాల కొరకు రూ.2 లక్షల చెక్కు ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు బొగ్గువరపు నరసింహులు




తెలంగాణ ముచ్చట్లు : శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరికరముల కొనుగోలునకు బొగ్గవరపు నరసింహా లు రూ. 2. లక్షలను విరాళంగా అందజేశారు.

# సినిమా న్యూస్




# ఘాటు ఫోజుల్లో క్యూటీ బ్యూటీ లా!



అవకాశాలు వస్తే ఒకే భాషలో కొనసాగాలి లేదంటే? మల్టీలాంగ్వేజెస్ ని టార్గెట్ చేయాలి. ఇలా చేయగల్గేది అతి కొద్ది మంది భామలే. అందులో సోనాల్ చౌహాన్ అనే యూపీ బ్యూటీ ఒకరున్నారని తప్పక గుర్తించాలి. అవును అమ్మడు కెరీర్ అలాగే ప్లాన్ చేసుకుని ముందుకు తీసుకెళున్నట్లు కనిపిస్తుంది. 'జన్నత్'తో బాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు అటుపై రెయిన్ బో టాలీవుడ్ లోనూ లాంచ్ అయింది. అటుపై నటసింహ బాలయ్య సహకారంతో అతని మూడు చిత్రాల్లో ఛాన్సులందుకుంది. అవిగాక ఇంకొన్ని తెలుగు సినిమాలు చేసింది. కానీ నటిగా ఇక్కడ బిజీ కాలేదు. అదే సమయంలో ఇతర భాషల్లోనూ అంది వచ్చిన అవకాశాలు చేజార్చుకోలేదు. కోలీవుడ్..బాలీవుడ్ లోనూ సినిమాలు చేసింది. వచ్చిన ఛాన్స్ మిస్ చేయకూడదు అన్న కోణంలో అమ్మడు ఏ భాషని విడిచిపెట్టలేదు. ఇటీవలే బెంగాలీకి వెళ్లింది. అటుపై నటసింహ బాలయ్య సహకారంతో అతని మూడు చిత్రాల్లో ఛాన్సులందుకుంది. అవిగాక ఇంకొన్ని తెలుగు సినిమాలు చేసింది. కానీ నటిగా ఇక్కడ బిజీ కాలేదు. అదే సమయంలో ఇతర భాషల్లోనూ అంది వచ్చిన అవకాశాలు చేజార్చుకోలేదు. కోలీవుడ్..బాలీవుడ్ లోనూ సినిమాలు చేసింది. వచ్చిన ఛాన్స్ మిస్ చేయకూడదు అన్న కోణంలో అమ్మడు ఏ భాషని విడిచిపెట్టలేదు. ఇటీవలే బెంగాలీకి వెళ్లింది. అక్కడ %-%డార్క్%-% అనే సినిమా చేసింది. ఇలా సోనాల్ కెరీర్ లో గ్యాప్ లు లేకుండా చూసుకుంటుంది. ఆ రకంగా సోనాల్ పదేళ్లకు పైగా జర్నీని దిగ్విజయంగా పూర్తిచేసింది. అలాగే అమ్మడు సోషల్ మీడియాలోనూ అంతే యాక్టివ్ గా ఉంటుంది. కొత్త కొత్త ఫోటోలతో కుర్రకారుని ఆకర్షిస్తుంది. తాజాగా అమ్మడు మరో హాట్ పిక్ తో నెటి జనుల ముందుకొచ్చేసింది. అమ్మడు డిజైనర్ దుస్తుల్లో స్కిన్ షో హైలైట్ చేసింది. సోనాల్ అలంకరణ, మ్యాకప్ మరింత అందంగా తీర్చిదిద్దాయి. పెదాలపై సన్నని నవ్వు ఫేస్ కి మరింత గ్లోనీ తీసుకొచ్చింది. ఔట్ ఫిట్, చెవి దిద్దులు అంతే ఆకర్షణీయంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది.

# నారా రోహిత్ ఎంగేజ్మెంట్.. పల్నాడు నటితోనే



యంగ్ హీరో నారా రోహిత్.. టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో వైవిధ్యమైన సినిమాలు చేసే నటుడిగా పేరు సంపాదించుకున్న విషయం తెలిసిందే. ప్రముఖ రాజకీయ కుటుంబాల్లో ఒకటైన నారా ఫ్యామిలీ నుంచి వచ్చిన ఆయన.. తనకంటూ స్పెషల్ క్రేజ్ దక్కించుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడి రెండో కుమారుడు అయిన రోహిత్.. త్వరలో బ్యాచిలర్ లైఫ్ కు బై బై చెప్పనున్నారని కొన్ని గంటలుగా వార్తలు వస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో నారా వారి అబ్బాయి.. ఓ ఇంటి వాడు కానున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ.. అది నిజమేనని తెలుస్తోంది. రీసెంట్ గా తనతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్న హీరోయిన్ ను నారా రోహిత్ ఎంగేజ్మెంట్ చేసుకోనున్నారు. ఏపీలోని పల్నాడు ప్రాంతానికి చెందిన ఆ చక్కటి తెలుగమ్మాయితో ఏడడుగులు నడవనున్నారు. నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి దగ్గరుండి వివాహ సంబంధం కుదిర్చారు. తన పెద్దనాన్న, పెద్దమ్మ చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి ఆధ్వర్యంలో నారా రోహిత్ నిశ్చితార్థం.. అక్టోబర్ 13వ తేదీన హైదరాబాద్ లో సింపుల్ గా జరగబోతోంది. అత్యంత సన్నిహితులు, బంధువులు మాత్రమే వేడుకకు హాజరు కానున్నారు. భువనేశ్వరి దగ్గరుండి అన్ని కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. ఇక డిసెంబర్ లో నారా రోహిత్ వివాహం ఘనంగా జరగనుందని ఇండస్ట్రీ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో నారా రోహిత్ ఎంగేజ్మెంట్ విషయం వైరల్ గా మారడంతో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు సెలబ్రిటీలతో పాటు అభిమానులు విషెస్ చెబుతున్నారు. హ్యాపీ మ్యారీడ్ లైఫ్ అన్న అంటూ ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. దీనిపై త్వరలో నారా ఫ్యామిలీ అధికారికంగా ప్రకటించనుందని తెలుస్తోంది.

# స్నేహితుడి వెంటే ప్రభాస్.. రూమర్స్ కి చెక్..!



టాలీవుడ్ స్టార్ హీరో ప్రభాస్ ఇప్పుడు పాన్ ఇండియా ఇమేజ్ తో సత్తా చాటుతున్నాడు. బాహుబలి తర్వాత ప్రభాస్ రేంజ్ ఏంటన్నది అందరికీ తెలిసిందే. బాహుబలి ముందు ప్రభాస్ ఇమేజ్ ఒకలా ఉంటే ఆఫ్టర్ బాహుబలి అది వేరే లెవెల్ కి చేరుకుంది. బాహుబలి తో ప్రభాస్ తన బాక్సాఫీస్ స్టామినా ఏంటో చూపించాడు. అప్పటి నుంచి ప్రతి సినిమా పాన్ ఇండియా లెవెల్ లో భారీ క్రేజ్ తెచ్చుకుంటున్నాయి. సాహెూ, రాధే శ్యాం, ఆదిపురుష్ నిరాశపరచినా సలార్ 1, కల్కి మళ్లీ నిలబెట్టాయి. ఈమధ్యనే రిలీజైన కల్కి సినిమా తో మరోసారి ప్రభాస్ మాస్ స్టామినా ఏంటో ప్రూవ్ అయ్యింది. ఐతే తన రేంజ్ పెరిగింది కదా అని అనవసర బిల్డప్ లు ప్రభాస్ ఇవ్వడు. ముఖ్యంగా స్నేహితుల విషయంలో అతను చాలా బాధ్యతగా ఉంటాడు. ప్రభాస్ తో కేవలం పరిచయం ఉన్న వారే అతన్ని డార్లింగ్ అంటారు. అలాంటిది ప్రభాస్ స్నేహితులను ఎలా చూసుకుంటారో అర్థం చేసుకోవచ్చు. ఐతే ప్రభాస్ పాన్ ఇండియా హీరో అయ్యాక తన స్నేహితుడు నటుడు ప్రభాస్ శ్రీనుని పట్టించుకోలేదన్న టాక్ వచ్చింది. ప్రభాస్ కి శ్రీను దూరమయ్యాడన్న వార్తలు గట్టిగా వినిపించాయి. అంతేకాదు ఈమధ్య ప్రభాస్ శ్రీనుకి సినిమాలు కూడా చాలా తక్కువ అయ్యాయి. సో ప్రభాస్ తో ప్రభాస్ శ్రీను టచ్ లో ఉన్నాడా.. అసలు వాళ్లిద్దరు మాట్లాడుతున్నారా లేదా అన్న డౌట్ మొదలైంది. కానీ రీసెంట్ గా ఆ డౌట్లన్నిటికీ క్లారిటీ వచ్చింది. రాజేంద్ర ప్రసాద్ కూతురు గాయత్రి ఈమధ్యనే మృతి చెందగా ఆయనకు ధైర్యం చెప్పేందుకు రాజేంద్ర ప్రసాద్ ఇంటికి వెళ్లారు ప్రభాస్. ఆ టైం లో ప్రభాస్ తో పాటు ప్రభాస్ శ్రీను కూడా కనిపించాడు. ఇదివరకు ప్రభాస్ ఎక్కడ ఉంటే అక్కడ కనిపించే ప్రభాస్ శ్రీను ఈమధ్య ప్రభాస్ తో కనిపించలేదు. అందుకే వీరిమధ్య దూరం పెరిగిందని అనుకున్నారు. కానీ రాజేంద్ర ప్రసాద్ ఇంటికి వెళ్లిన ప్రభాస్ తో పాటుగా తన స్నేహితుడు ప్రభాస్ శ్రీను కూడా ఉన్నాడు. సో ఈ క్లారిటీ తో ప్రభాస్ ఎలాంటోడో మరోసారి ఫ్యాన్స్ కు అర్థమవుతుందని చెప్పొచ్చు. ప్రభాస్ శ్రీను సినిమాలు ఎందుకు తగ్గించాడో తెలియదు కానీ ప్రభాస్ వెంటే తాను అని మరోసారి తన స్నేహితుడితో కనిపించి ఆడియన్స్ ని ఆకట్టుకున్నాడు.

# సమంత నా సోల్ సిస్టర్ : శోభితా ధూళిపాల



ప్రస్తుతం తన తాజా హిందీ చిత్రం 'లవ్, సితార' విజయాన్ని ఆస్వాదిస్తున్న శోభితా ధూళిపాళ ఇటీవల తన సోదరి సమంతను తన 'నిజమైన ఆత్మీయురాలు' అని అభివర్ణించింది. సమంత తమ కుటుంబ సభ్యురాలు మాత్రమేనని, సోదరీమణుల మధ్య లోతైన బంధాన్ని ఆవిష్కరించింది శోభిత. శోభిత తన జీవితంలో కొత్త అధ్యాయంలోకి ప్రవేశిస్తున్న సమయంలో సోదరితో బంధం గురించి మాట్లాడింది. సిస్టర్స్ నడుమ సాన్నిహిత్యం అందరి దృష్టిని విశేషంగా ఆకర్షిస్తోంది. అయితే ఈ సందర్భంలో అసలు ఈ సమంత ఎవరు? అంటూ అభిమానులు గందరగోళంలోనే ఉన్నారు. సమంత పేరెత్తగానే శోభితకు కాబోయే భర్త నాగచైతన్య మాజీ భార్య సమంత అనుకునేవాళ్లు లేకపోలేదు. కానీ ఆ సమంత వేరు.. ఈ సమంత వేరు. ఇక్కడ సమంత స్వయానా శోభితకు చెల్లెలు. ఆ ఇద్దరినీ ఒకేచోట చూశాక అభిమానులు మరింత గందరగోళంలో పడిపోతున్నారు. ఆ ఇద్దరిలో ఎవరు శోభిత అనే కన్ఫ్యూజన్ కూడా నెలకొంది. అక్కా చెల్లెళ్లు అచ్చు గుద్దినట్టున్నారు. ప్రస్తుతం శోభిత- సమంత అందమైన ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. సమంత, శోభిత ఇద్దరూ వారి వృత్తిలో బిజీ నాయికలుగా ఉన్నారు. ఇద్దరు ప్రముఖ కథానాయికలు పాన్ ఇండియన్ సినిమాల్లో నటిస్తున్నారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151."PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,"CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in